అమ్మ ఎట్లా ఉంటుంది?

"నాన్నా! అమ్మ ఎట్లా ఉంటుంది?"

ఈ ప్రశ్న ప్రతిరోజూ రాత్రి పడుకోబోయేటప్పుడు తండ్రి పక్కన మంచం మీద పడుకునే శీనుకు ఎదురయ్యేది.

'తల్లిని గురించి తండ్రి చెప్పిన దానితో ఆమె ఆకారం సరిపోయింది. మాటల్లో ప్రేమలేదు. పలకరింపులో ఆప్యాయతనం లేదు. మొదటిమారు భావరహితంగా రెండోమారు పుల్ల విరిచినట్లుగా వుంటుంది. ఎంత తేడా మాటకు మనిషికీ?'

పగలంతా మథన - అందులోంచి ఉద్భవించేదీ ప్రశ్న! ఆ లేత హృదయం కంపించి గాలిదుమారంలోని ఆకులా ఊగిపోయేది

స్నేహితుల ఇళ్ళకు వెళ్ళినప్పుడు శీను వాళ్ళ తల్లులను చూసేవాడు. పొట్టీ పొడుగూ నలుపూ తెలుపుల భేదం, నల్లటి తల వెంట్రుకలూ నెరిసిన తలలూ - సిరిగల ఇళ్ళూ-సిరిలేని ఇళ్ళూ కనబడుతూ వుండేవి. వాళ్ళెట్లా వున్నా పిల్లలను చూడగానే వికసించిన ముఖాలతో "నాయనా, రా. కాళ్ళు చేతులు కడుక్కుని రా. టిఫిన్ తిందువుగాని. పగలంతా స్కూల్లో చదువుకున్నావు, ఆడుకున్నావు" అని గుండెకు హత్తుకుని, తల మీద ముద్దు పెట్టుకున్న దృశ్యాలు - చూసిన శీను హృదయంలో నిలచిపోయాయి. మనసులో ఏదో వెలితి. తీరని ఆకలి - తీరని దాహం - ఆవేదనగా ఉండేది.

"నాయనా!" ఆ పిలుపు ఎంత తియ్యగా ఉంది? అలా ఎవరయినా తనను పిలిస్తే? అబ్బ! మనసు పొంగిపోదూ? పోనీ 'శీనూ' అని మనసారా పిలిచినా తన మనసు ఆనందంతో గంతులు వెయ్యదూ?

అమ్మ 'బాబూ!, బాబూ' అంటూ ముద్దు చేస్తుంటే, నాన్న వచ్చి 'వాడికేం కావాలో ఇవ్వు. ఏడిపించకు' అని గారాబంతో తన బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంటుంటే ఎంత బాగుంటుంది? ఎంత గమ్మత్తుగా ఉంటుంది?

అట్లా వాళ్ళ అమ్మా నాన్నా చేస్తారనేగా 'నందు' అంత పొగరుగా మాట్లాడుతాడు ?

అబ్బ, అమ్మను గురించి ఎవరూ చెప్పరేం ? అమ్మ ఎలా వుంటుందంటే ఒక్కరయినా జవాబు చెప్పరేం ?

అందరిలాగే తనకూ ఒక అమ్మ వుండాలి కదా ?

అమ్మ - అమ్మ - అయితే ఆమె ఎలా వుంటుంది ?

రాత్రి పది గంటలవరకూ శీనుకు నిద్ర పట్టలేదు. అతడి పక్క మంచం మీద పడుకున్న తండ్రి శీను పడుకున్నాడనుకొని ఏదో పుస్తకం తెరిచాడు. రచయిత పేరు- రాసిన విషయం- అచ్చయిన సంవత్సరం - ధర - ఎన్నో ఎడిషను మొదలైన విషయాలు చూసి మొదటి పేజి తెరిచాడు.

"నాన్నా !"

"ఊఁ. ఇంకా మేలుకునే ఉన్నావా ? నీవు నిద్రపోయావనుకున్నాను !"

"లేదు నాన్నా. నిద్ర రావటం లేదు"

"ఒక మంచి కథ చెప్పనా ?"

"వద్దు నాన్నా"

"మరేం కావాలి ? కళ్ళు మూసుకో. నిద్రవస్తుంది"

"ఉహూఁ, అమ్మ ఎట్లా వుంటుందో చెప్పాలి" తండ్రి గుండెమీద చెయ్యి వేశాడు.

"అమ్మ ఎట్లా ఉంటుందంటే—ఆఁ—ఆఁ—తెల్లగా వుంటుంది. నల్లగా మెలికలు తిరిగిన మూరెడు వెంట్రుకలు. ముక్కు చక్కగా నీ ముక్కులాగే ఉంటుంది. దట్టమైన కనుబొమ్మలు. చిన్నగా గుండ్రంగా ఉండే మూతి. నాకంటే పొట్టి. గలగలా నవ్వేది. నవ్వినప్పుడు కళ్ళు మూసుకుపోయేవి. బాగా చదువుకుంది. ఫేషన్‌బుల్‌గా ఉండేది. ఎప్పుడూ అలంకరించుకుని ఉండేది. రవిశంకర్ దగ్గర నేర్చుకున్న హిందూస్తానీ సంగీతం అత్యద్భుతంగా సితార్‌మీద వాయించేది.

మెత్తటి తివాచీ పరచిన బల్లమీద కూర్చుని, ఆమె సితార్ వాయిస్తుంటే చూచిన వాళ్ళు తన్మయులై పోయేవారు.''

''నాన్నా అమ్మ ఎట్లా మాట్లాడేది?''

''మెల్లగా ఎంతో ఆదరంతో-ప్రేమతో మాట్లాడేది. ఆమె మాట్లాడిందంటే ఆకలి దప్పులు ఉండవు. ఎండలోవచ్చినవాడికి చల్లటినీడలో సేదదీరినట్టుంటుంది.''

''అయితే నాన్నా, - అమ్మదగ్గరికెళ్దాం. ఆమె దగ్గరే మనమూ ఉందాం. ఏం నాన్నా?''

''అలాగే నీ యిష్టప్రకారమే చేద్దాం. ఇప్పుడు పడుకో, తెల్లవారిన తరువాత ఏర్పాట్లు చేద్దాం''

''మరి నీవు మర్చిపోయి ఆఫీసుకు వెళ్ళిపోవద్దు''

''ఎందుకు వెళ్తాను? వెళ్ళను, పడుకో''

కళ్లు మూసుకుంటూ తెరచుకుంటూ కొంతసేపటికి నిద్రలోకి జారుకుంటాడు శీను.

ఇలా మూడు నాలుగేళ్ళు వచ్చినప్పటి నుంచీ తల్లికోసం శీను అడుగుతూనే ఉన్నాడు అతడి ఈడుకు తగినట్టుగా నచ్చ చెప్పుతూ కాలక్షేపం చేస్తున్నాడు శివరామ్.

పదమూడు సంవత్సరాలు వచ్చిన శీనుకు ఇప్పుడిప్పుడే తండ్రి మీద అనుమానం వస్తోంది. ఎందుకంటే ప్రతిరోజూ ఇవే మాటలు చెబుతాడు. తను స్కూలుకు వెళ్ళి పదిమంది పిల్లలతో మెదిలే పదమూడేళ్ళ పిల్లవాడనుకోవడం లేదు. ఏవేవో మాటలు చెప్పి మాయబుచ్చుతున్నాడు. తనకు ఆ మాటలపట్ల నమ్మకం కుదరటంలేదని నాన్నకు తెలియదా? అనుకుంటాడు శీను.

శీను ముఖం కొంచెం విచారంగా కనబడగానే శివరామ్ అతడికి ఇష్టము వచ్చిన వస్తువులు తెచ్చియిస్తాడు. ఎంత ఖరీదయినదయినా లెక్క చేయడు. పదిమంది పిల్లలను పిలుస్తాడు. వాళ్ళతోపాటు శీను ఆనందంగా ఉండాలని ఆయన ఆశ. శీను, తల్లిని మరచిపోవాలని ఆయన ఆకాంక్ష.

కాని, శీను అంత తొందరగా మరిచిపోయేవాడు కాదు. ఊరికే జ్ఞాపకం చేసుకుని బాధపడతాడు.

శివరామ్ ఒక్కసారయినా విసుక్కోకుండా శీను అడిగిన ప్రశ్నలకు పరమ శాంతంగా జవాబులిస్తూ వుంటాడు ఆ చిన్న పిల్లవాడికి తల్లి ఎందుకుదూరమైందో చెప్పలేక మనసులో కుళ్ళిపోతాడు.

కోర్టులో డైవోర్సు కేసు నడుస్తుండగా కూడా తన అహం చంపుకుని సునీత దగ్గరికి వెళ్ళి "ఈ ఏణ్ణర్థం పిల్లవాడి ముఖం చూసి అయినా-నీ కడుపులో వున్న ఆరునెలల బిడ్డను తలుచుకొని అయినా కేసు ఉపసంహరించుకో" మని బ్రతిమిలాడాడు. ఎందరిచేతనో చెప్పించాడు. ఆమె తల్లిదండ్రులను కూడా అర్థించాడు. ఆమె ఎవరి మాటా వినలేదు. తలవంచుకున్నదిగాని జవాబివ్వలేదు.

శివరామ్‌కు సునీత మనసులోని మర్మం ఏం తెలుసు? కాలేజీలో చదువుతుండగా చంద్రన్-ఆమె ప్రేమించుకున్నారని, తల్లిదండ్రులు అభ్యంతరం పెట్టారని, అతడు ఆ వైరాగ్యంతో విదేశాలకు వెళ్ళి, నాలుగేళ్ళ తరువాత వచ్చి, ఆమెకోసం వెదకి వెదకి తెలుసుకుని, వుత్తరం రాసి కలుసుకున్నాడనీ తెలియదు. అప్పుడప్పుడు కలుసుకుని వాళ్ళిద్దరూ కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు కాబోలు. ఉత్తరం రాసిపెట్టి ఇంట్లోంచి వెళ్ళిపోయింది. కోర్టువారు తీర్పు ఇచ్చే నాటికి 'ఆశ' అనే ఆడపిల్ల పుట్టింది. సునీత ఇష్టం మీదనే శీను తన దగ్గరుంటున్నాడు.

ఆమె-సునీత-బొంబాయిలో హాయిగా చంద్రన్ దగ్గర ఉంది. ఆశ అతడిని 'నాన్నా' అని పిలుస్తుంది. అందరూ సంతోషంగా వున్నారు.

ఇక్కడ శీనుకు ఒకటే దిగులు. అందరికీ ఉండగా లేనిది తనకు ఎందుకు లేకపోవాలి అమ్మ?

శీను స్కూలుకు వెళుతున్నాడుగాని చదువుమీద శ్రద్ధ తగ్గడం మొదలుపెట్టింది. స్కూల్లో టీచరు చెప్పినపాఠాలను అతడుఅర్థం చేసుకోలేకపోతున్నాడు. తలకెక్కటంలేదు. ఇంట్లో ట్యూషన్ చెప్పితే లాభం కలుగుతుందేమోనని శివరామ్ సమర్థుడైన టీచర్‌ను పెట్టాడు.

కాని-శివరామ్ ప్రయత్నం ఫలించలేదు. చదువు లేకపోయినా పిల్లవాడు నానాటికి మందకొడిగా తయారయ్యాడు. వరసగా పరీక్షతప్పటం మొదలుపెట్టాడు.

శివరామ్‌కు ఎటూ తోచటంలేదు. ఒక ఏడాది సెలవుపెట్టి అతడికి చూడ వలసిన ప్రదేశాలన్నీ చూపించటానికి బయలుదేరాడు.

ఏదయినా కన్నుల పండువుగా ఉన్న దృశ్యం చూసినప్పుడు "నాన్నా. అమ్మ ఉంటే బాగుంటుంది కదూ ? ఇవన్నీ చూసేది కదూ ?" అనేవాడు.

శివరామ్ హృదయం ఆ మాటలకు క్రుంగిపోయేది. మళ్ళీ తనకు తానే ఊరడించుకుని తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో "అవున్రా, నేనూ ఆ మాటే అనుకుంటున్నాను. అమ్మవస్తే చాలా బాగుండేది. సరేలే మనం చూసి ఇంటికి వెళ్ళిన తరువాత ఉత్తరం రాద్దాం" అనేవాడు.

"ఇంటికి వెళ్ళాక ఉత్తరం వ్రాయడమేమిటి నాన్నా! ఎక్కడుందో చెప్పు. నేను పిలుచుకుని వస్తా. ఎంతో అందంగా ఉంటుందన్నావు. తియ్యగా చల్లగా మాట్లాడుతుందని అన్నావు. సంగీతంలో నిధి అన్నావు. గ్రాడ్యుయేటన్నావు అటువంటి ఆవిడ నాకు తల్లంటే నాకెంతో సంబరంగా ఉంది. ఎక్కడున్నదో ఇన్నాళ్ళనుంచీ చెప్పలేదు. ఇప్పుడయినా చెప్పు ! నేను వెళ్ళి మా అమ్మను చూసి పిలుచుకుని వస్తాను. అంతటి మెత్తటి హృదయమన్నావు. మరి-మనం.... అందులో నేను 'అమ్మా' అని పిలిస్తే రాదా ? తప్పకుండా వస్తుంది నాన్నా."

శివరామ్ అతడికి దక్షిణ దేశంలోని చూడదగిన ప్రదేశాలన్నీ చూపించాడు. వివేకానందరాక్ చూపించాడు. మూడు సముద్రాలు ఒక్కచోట కలిసిపొంగే చోటు చూపించాడు. ఎన్నో వస్తువులు కొనిఇచ్చాడు.

కాని శీను ముఖంలో ఇవన్నీ చూసిన సంతోషంలేదు. వింత వింత వస్తువులను కొనుక్కున్న ఆనందంలేదు. ప్రయాణం బులుపులేదు.

నిరాశతో ఇంటికి వచ్చిన శివరామ్ వైద్యులను సంప్రతించాడు. పిల్లవాడు అన్ని విధాలా ఆరోగ్యవంతంగా వున్నాడు. కాని అతడి మనసు అతడి స్వాధీనంలో లేదు.

శీనును అనేక రకాల ప్రశ్నలు వేశారు డాక్టర్లు. అన్నిటికి సరిగ్గా సమాధానాలు ఇచ్చాడు. తనకే బాధ లేదంటాడు.

డాక్టర్లు పది రోజులపాటు ప్రతిరోజు వచ్చి కులాసాగా కబుర్లు చెబుతూండేవారు.

"ఇంత తెలివైన వాడవు-ఇంత విచారంగా ఉంటా వెందుకు? పరీక్షలు బాగా రాయలేదెందుకు? మీ నాన్న నీ కోసం ఎంత కష్టపడుతున్నాడో చూడు. నీవు పదిహేనేళ్ళ పిల్లవాడివయ్యావు. నీ బాధ్యత నీకు తెలియవద్దా శీనూ?"అంటూ అతడి భుజంమీద చెయ్యేసి చనువుగా అడగటం మొదలుపెట్టారు.

కొంచెం పెద్దవాడయిన తరువాత శీనుకు మనసులో ఉన్నమాట మనసులోనే వుండిపోతున్నదిగాని వెనకటివలె త్వరగా బైటికి రావటంలేదు. అందరి ముందర అతడు మనసు విప్పటంలేదు. తనలో తనే కుమిలిపోతున్నాడు.

"అమ్మ ఎట్లా ఉంటుంది? నేను మా అమ్మను చూడాలి." ఒకనాడు తలవంచుకొని చెప్పేశాడు శీను.

డాక్టర్లు తుళ్ళిపడ్డారు. శివరామ్‌గారు అన్ని విషయాలు చెప్పారు. కాని-ఈ మాట మాత్రం చెప్పలేదు. ఇదే ఈ పిల్లవాడికి బెంగఅయి ఉంటుంది అనుకున్నారు.

"ఈ పిల్లవాడికి మీరు తల్లిని చూపించకపోతే లాభంలేదండీ. అతడికి ఆరోగ్యం బాగుంది. తెలివితేటలున్నాయి. అతడికి తల్లి బెంగతప్ప మరేంలేదు" డాక్టర్లీ విషయం తేల్చి చెప్పారు.

శివరామ్ పిల్లవాడి కొరకు డబ్బు ఖర్చుచేయగలడు. ప్రేమగా చూడగలడు కాని, తల్లి విషయంలో ఏం చేయగలడు? ఆమె నెట్లా తీసుకురాగలడు?

"ఈ బెంగ ఏ జబ్బు క్రిందికైనా మారవచ్చు"నని డాక్టర్లు హెచ్చరించారు. తనిప్పుడేం చేయాలి?

వారం రోజు లాలోచించాడు. కడుపుతీపికంటే అభిమానం గొప్పదా? చూస్తూ చూస్తూ కన్నబిడ్డను మాటపట్టింపులకూ, పంతాలకూ ఎర చేయగలడా?

వెంటనే రాగద్వేషాలకతీతమైన శక్తిని తెచ్చుకుని-"పిల్లవాడు నీ కోసం చాలా దిగులుపడ్డాడు. సరిగా చదువుకోవటంలేదు. ఆరోగ్యం చెడిపోతుందని

డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. వీడిని నీ దగ్గర అట్టిపెట్టుకో. ఖర్చులు నేను భరిస్తాను. నీవు సరేనంటే ఎవరిచేతికయినా ఇచ్చి పంపుతాను" అని రాశాడు. ఈ ఉత్తరం రాయటానికి రెండు రోజులు పట్టింది శివరామ్‌కు. రాయటం-చింపటం-రాయటం-చింపటం-చిత్తు కాగితాల బుట్ట నిండింది.

"పిల్లవాడిని పంపించండి" అన్న ఉత్తరం. శివరామ్ రాసిన జాబు చేరిన నాలుగో నాటికే వచ్చింది.

శీను స్కూలు నుంచి రాగానే శివరామ్ సంతోషకరమైన వార్త చెప్పాడు. శీను ముఖం వికసించింది.

"నాన్నా! నీవు కూడా రాకూడదూ? ఇద్దరం చూసి తీసుకువద్దాం" ఉత్సాహం పట్టలేని శీను వెర్రిగంతులేస్తున్నాడు.

"నాకు సెలవు దొరకదురా శీనూ. నువ్వెళ్ళి చూడు. రమ్మని అడుగు. వస్తే తీసుకురా. నీకు కావలసినంత డబ్బు తీసుకెళ్ళు" శివరామ్ కూడా చాలా వుత్సాహం కనబరచి శీనును ప్రోత్సహించాడు.

శీను ప్రయాణానికి తగిన ఏర్పాట్లు అన్నీ జరిగాయి. బయలుదేరేనాడు శివరామ్ శీసును గుండెలకు హత్తుకుని "శీనూ, వెళ్ళగానే ఉత్తరం రాయి. ఈ నాన్నను మరచిపోకు" అన్నాడు చెమ్మగిల్లిన కళ్ళతో.

"నాన్నా. నేను అమ్మను తీసుకువస్తాను చూడు" అంటూ ధీమాగా-తల్లిని గురించి తీయ తీయటి కలలు కంటూ-ఒక రోజంతా ప్రయాణం చేసి తండ్రి ఇచ్చిన అడ్రసు ప్రకారం ఇంటికి వెళ్ళాడు.

ఒకామె ఎదురుగుండా వచ్చి లోపలికి తీసుకు వెళ్ళింది. కుశల ప్రశ్నలు అడిగింది. కాఫీ టిఫిన్ పెట్టింది. కాని ఆమె ముఖంలో అతడు వెదకిన ప్రసన్నత కనబడలేదు

లోపల నలుగురు పిల్లలున్నారు. అందరూ అతడిని వింతగా చూడటం మొదలుపెట్టారు.

వాళ్ళను శీను చూడనట్లే ఉన్నాడు.

ఆమె తల్లి అయిఉంటుందని ఊహించుకున్నాడు. ఆమె ప్రేమతో పలకరిస్తే 'అమ్మా' అంటూ ఆమెను కౌగిలించుకోవాలనీ-ఆమె ముద్దులు అందుకోవాలనీ-ఆమె గారాబంగా 'నాయనా' అంటూ తనను దగ్గరికి తీసుకుంటుందనీ ఎదురు చూస్తున్నాడు.

ఆమె మామూలుగా "ఇక్కడ స్కూల్లో చదువుకుంటావా? ఇవాళ కను క్కొని రేపు చేరుస్తాను" అంది. అతడికి వేళకు భోజనం పెట్టింది. పడుకోటానికి ఒక మంచం తెచ్చి వేసింది. ఆమె ముఖంలో ఏదో చికాకు-ఏదో అలజడి కనిపించిం దతడికి.

అనాడంతా ప్రయాణం బడలికవల్ల శీను బాగా నిద్రపోయాడు.

అతడు నిద్రలేవగానే చంద్రన్ ఎదురుగా కనుపించాడు. శీను మంచం మీద లేచి కూర్చున్నాడు.

ఇద్దరూ ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు.

"నీకు చదువు సరిగా సాగటం లేదట గదూ? ఇక్కడ చదువుకుంటావా?" అడిగాడు చంద్రన్.

శీను మాట్లాడలేదు. అతడికి తల్లి ప్రేమతో పలకరించాలని వుంది. తల్లిని తనతో తీసుకుపోవాలని వుంది. దానికోసమే ఎదురు చూస్తున్నాడు.

సునీత ఆ నలుగురి పిల్లలతో కూడా అతడికి భోజనం పెట్టేది. ఏదయినా కావాలంటే ఇచ్చేది. మళ్ళీ అతడితో మాట్లాడటానికే ఆమెకు అవకాశం దొరికేది కాదు. సాయంకాలం కాగానే చంద్రన్‌తో బైటకి వెళ్ళిపోయేది. ఏ రాత్రికో తిరిగి వచ్చేవారు. ఈ లోపు నౌకర్లు పిల్లలకు భోజనాలు పెట్టేవారు.

స్కూళ్ళు తెరిచారు. సునీత అతడిని ఒక స్కూల్లో చేర్చింది.

కాని-శీను మనసు యధాప్రకారం దేనికోసమో ఆరాటపడుతున్నది. ఇన్ని రోజులయింది తాను వచ్చి. తల్లి ఒక్క పావుగంటయినా తన దగ్గర కూర్చోటం లేదు. ఒక్క మాటయినా ప్రేమతో పలకరించలేదు. తన తండ్రిని గురించి ఒక్క సారయినా అడగలేదు.

తల్లిని గురించి తండ్రి చెప్పినదానిలో ఆమె ఆకారం సరిపోయింది. కాని-ఆయన చెప్పిన ప్రేమపూరితమైన మాటలు లేవు. తీయ తీయటి పలకరింపులు లేవు. మొదటి మాట భావరహితంగా ఉంటుంది. రెండవ మాట పుల్లవిరిచినట్లుగా ఉంటుంది. ఎంత తేడా మాటకూ మనిషికీ ?

ఈ మానసిక కల్లోలంలో శీను పరీక్ష తప్పాడు అతడికి ఇక్కడికి వచ్చిన తరువాత తానూహించిన మాతృ హృదయం కనబడలేదు. దానికోసం తల్లడిల్లి పోతున్నాడు.

తనెంతగా వూహించాడు ? ఎన్ని కలలు కన్నాడు? తల్లికోసం ఎంత బెంగ పెట్టుకున్నాడు ? ఎంత తహతహలాడి పోయాడు ?

మళ్ళీ అతడిలో నిర్లిప్తత ప్రవేశించింది. టీచరు చెప్పింది మనసులో కెక్కదు. చదువు మీద ధ్యాస నిలవదు.

ఆమె విసుక్కున్నది. "ఇంత మాత్రానికి ఇక్కడికెందుకు వచ్చావు ? నువ్వే వచ్చావా లేకపోతే నా మీదకి నెట్టాలని ఆయనే పంపారా ? మనిషికి తెలివి వుండాలిగాని ఎక్కడుంటే ఏం చదువుకోటానికి?" మొఖం చిట్లించి మందలింపుగా అన్నది.

"తిండి దండుగ. తిప్పి పంపించు" అప్పుడే వచ్చిన చంద్రన్ అన్నాడు.

శీనుకు మతిపోయినట్లుగా ఉంది అన్నం తినబుద్ధి కాలేదు. తను అనుకున్నదొకటీ. జరిగిందొకటీ. తనెంతటి ఉత్సాహంతో వచ్చాడిక్కడికి ?

తాను కోరింది ఒకటి-లభించింది ఒకటి

ఆ రాత్రి అతడికి తెలియకుండానే తండ్రి మీదికి మనసుపోయింది. నాన్న చెప్పిన తీయటి మనసు ఇక్కడలేదు. అంటే అమ్మ ఇక్కడ లేదన్నమాటే.

తెల్లవారకముందే తన బట్టలు సర్దుకున్నాడు. పిల్లలకోసం తండ్రి యిచ్చిన వస్తువులు ఇవ్వబుద్ధికాలేదు. ముక్కు విరుచుకుంటూ పెట్టె చేతబట్టుకుని-స్టేషన్ చేరాడు.

ఉరుకు పరుగులతో ఇంటికి వచ్చి తండ్రి కోసం ఇల్లంతా వెతికాడు. శివరామ్ డాబామీద పడక్కుర్చీలో పడుకుని వెర్రిచూపులు చూస్తున్నాడు.

సాయంకాలం ఆరుగంటల సమయమది. ఆయిన ఆఫీసు నుంచి వచ్చి అక్కడ కూర్చున్నట్టుగా ఉన్నాడు. ఎదురుగా బల్లమీద కాఫీ, టిఫిన్, మంచినీళ్ళు వున్నాయి.

"నాన్నా. నాన్నా. నువ్వింకా కాఫీ తాగలేదూ? చల్లారిపోతోంది" అంటూ కుదిపాడు శీను. "ఎప్పుడు వచ్చావురా? ఒక్కడివే వచ్చావా?" ఆయన మాట చాలా నీరసంగా వినబడ్డది శీనుకు.

"ముందు కాఫీ, టిఫిన్ తీసుకో. అబ్బ, ఎంతో చిక్కిపోయినట్టు కనిపిస్తున్నావు. సరిగా భోజనం చేస్తున్నావా అసలు?" తన కుర్చీ ఆయన కుర్చీకి దగ్గరగా తీసుకున్నాడు.

"నా తిండిదేమిటిగాని-నీవు కులాసాగా ఉన్నావా? పరీక్ష ప్యాసయ్యావా? మరి నీవు రావేమోననుకుంటున్నాను" అన్నాడు శివరామ్ దీనంగా ముఖంపెట్టి.

శీనుకు కళ్ళలో నీళ్ళు నిండాయి.

"నాన్నా. నేను నీ దగ్గరే ఉంటాను. ఇక్కడే బాగా చదువుకుంటాను. అక్కడ ఉన్నప్పుడు నాకు నీ మీద బెంగగా ఉండేది. అందుకే పరీక్షపోయింది" అన్నాడు.

"ఇన్నేళ్ళు అమ్మకోసం బెంగపెట్టుకుని వెళ్ళిన వాడివి-నా కోసం అక్కడికి వెళ్ళి బెంగపెట్టుకున్నావా?" ఆయన నీరసంగా నవ్వారు అతడిలోకలిగిన మార్పుకు.

"అవును. నువ్వు అమ్మను గురించి అన్నీ అబద్ధాలు చెప్పావు నీవు చెప్పింది ఒక్కటీ కనబడలేదామెలో. ఇవాళ్టి నుంచీ అమ్మా నాన్నా నువ్వే"

కొడుకుతల తండ్రిభుజమ్మీదికీ-తండ్రితల కొడుకుభుజమ్మీదికీ వాలాయి కళ్ళనీళ్ళతోపాటు.

(ఆనందజ్యోతి-సచిత్ర వార పత్రిక)